# తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) చిన్నకథల పోటీలో

# చావుభయంలో!

**తిరుమల 'బస్టాండు'లో క్యూ లోంచి బయట పడేసరికి కాస్త వూపిరి వచ్చినట్టయింది రామానుజానికీ, అతని భార్య కామాక్షికీ.**

**"దేవుని దర్శనానికి క్యూలో వెళ్లేటప్పుడు కూడా ఇంత విసుగనిపించలేదు" అన్నాడు రామానుజం చిరాగ్గా.**

జనం ఎక్కువగానే వున్నారు. ఎలాగో తంటాలు పడి బస్సు ఎక్కారు. సీటు మానుకొని కూర్చున్నారు.

"తిరుపతి చేరేటప్పటికి మనకు చిత్తూరు బస్సు రెడీగా వుంటుం దంటారా?" అడిగింది కామాక్షి.

"బస్సు గురించి బాధ లేదులే" అన్నాడు రామానుజం.

యథాలాపంగా వెనక్కు తిరిగి చూచిన కామాక్షి వులిక్కిపడింది. వెనక సీట్లో జగన్నాథం భార్యతో సహా కూర్చుని వున్నాడు. కామాక్షి అటు చూడగానే మాపు మరల్చి కిటికీలోంచి బయటకు చూడసాగాడు.

"వెనక ఎవరు కూర్చున్నారో చూడండి" మెల్లిగా అంది కామాక్షి భర్తతో.

రామానుజం తిరిగి చూశాడు.

భార్యాభర్తలిద్దరూ అలా ఒకరి తరువాత ఒకరు తిరిగి చూడడంతో జగన్నాథం భార్య వరలక్ష్మి భర్త చెవిలో యేదో గుసగుసలాడింది. జగన్నాథం మొహం ఎర్రబడింది.

బస్సు బయలుదేరింది.

"సరేలే. ఆ వైపు చూడకు మరి" అన్నాడు రామానుజం యిటు తిరిగి కామాక్షితో.

"ఇందాక ఎక్కడా కనిపించలేదే వీళ్లు!" అంది కామాక్షి.

"వాళ్లు కనిపిస్తేనేం, కనిపించక పోతేనేం! మాట్లాడకు. ఊరుకో. వాళ్ల గురించి ఏదో పెద్దగా మాట్లాడుతున్నా మనుకోగలరు" అని పుస్తకం ఒకటి తీసి తిరగేయసాగాడు రామానుజం.

జగన్నాథం కామాక్షికి స్వయానా తోడబుట్టిన అన్న. అయితే చాలా రోజుల నుంచి వాళ్లకూ, వీళ్లకూ మాటలు లేవు. వ్యాపారంలో రామానుజానికీ, జగన్నాథానికీ మధ్య ఏర్పడ్డ స్పర్థలు చివరకు ఇద్దరి కుటుంబాలకూ మధ్య వున్న బాంధవ్యాన్ని త్రెంచేశాయి. నిజానికి రామానుజం గానీ, కామాక్షిగానీ ఎవరినీ ద్వేషించే వారు కారు. కానీ జగన్నాథం ఒక ర కంగా కుళ్లుబోతు మనిషి. వరలక్ష్మి అతనికి తగిందే. వ్యాపారానికి, బంధుత్వానికి ముడిపెట్ట కూడదని రామానుజమే ఎప్పుడైనా పలుకరించబోయినా జగన్నాథం తల తిప్పుకొని పోయేవాడు. కనీసం చెల్లెలిపైన అభిమానం కూడా లేకపోయిందతనికి. ఒకటి రెండుసార్లు భంగపడ్డాక రామానుజం కూడా పలకరించడం మానేశాడు.

బస్సు సాగిపోతూ వుంది.

రామానుజం పుస్తకం మూసి కామాక్షి వైపు చూశాడు. ఆమె కిటికీ లోంచి బయటకు చూస్తోంది. అప్పటికి చీకటి కమ్ముకుంది. బస్సు హెడ్ లైట్ల వెలుతురులో మెలికలు తిరుగుతున్న రోడ్డు తళతళా మెరుస్తోంది. బస్సు వేగం కొద్దిగా పెరిగింది.

ఉన్నట్టుండి బస్సులో ఏదో కలకలం. డ్రైవర్ సీటు ప్రక్క సీట్లో కూర్చున్న తను మరో మనిషితో ఏదో చెబుతున్నాడు.

ఏమయిందంటే, ఏమైందని అందరూ అడుగు తున్నారు.

"బ్రేకులు పడడం లేదట" అన్నాడు ఒకాయన.

ప్రయాణీకుల మొహాల్లో కంగారు కనిపించింది. డ్రైవరు కూడా కంగారుగానే వున్నాడు.

"ఎలా ఇప్పుడు మరి?"

"గేరు మీద వెళ్తున్నాడు. ఫరవా లేదులే. డ్రైవర్ కాస్త ఘటికుడే."

"అయినా ప్రమాదమే కదా!"

"వేరే దారేం వుందీ!"

ఎవరికి తోచినట్టు వారు మాట్లాడుతున్నారు.

"భయంగా వుందండీ!" అంది కామాక్షి.

"మరేం ఫరవాలేదులే. కంగారు పడకు" అని ధైర్యం చెప్పాడు రామానుజం.

ఫస్టు గేరు మీదే వెళ్తోంది బస్సు. అయినా రోడ్డు మెలికలలో బస్సు తిరుగుతున్నప్పుడు ప్రతిసారీ 'ఏడు కొండలవాడా! వేంకట రమణా! గోవిందా!' అని అరుస్తున్నారు ప్రయాణీకులు.

అక్కడికీ నయం. రెండో ఘాటు రోడ్డు బాగానే వుంది కాబట్టి కొండ పైకి వెళ్లే బస్సులు ఆ దారిని వెళ్తున్నాయి కాబట్టి ఎదురుగా వచ్చే బండ్లు లేవు. గుడ్డిలో మెల్ల!

"పైకి వెళ్లేటప్పుడైతే కొంచెం ఫరవాలేదు. క్రిందికి దిగుతున్నప్పుడు బ్రేకులు లేని బండితో చాలా ప్రమాదమే" అంటున్నారెవరో.


మొన్న ఒక కారు యిలాగే ఏదో వెడి [illegible]యలో పడిపోయిందట. ఆరు మంది చనిపోయారు.

డ్రైవర్ అసహనంగా వురిమి చూశాడు వెనక్కు.

"అయ్యో! డ్రైవర్‌సార్! మీరు వెనక్కు తిరక్కండి" అని డ్రైవరును బతిమాలుకుని "అందరూ కాస్త నోరు ముయ్యండి" అని అందరినీ కసిరాడు ఒక వడి వయస్కుడు.

భుజంపై మీద వెనక నుంచి ఎవరిదో

## రచయిత స్వపరిచయం



స్వస్థలం చిత్తూరు. ఆరేండ్లుగా వుంటున్నది తమిళనాడులోని తిరుత్తణిలో.

ఏదో ఒకటి రాస్తూ వుండమని అమ్మ, శ్రీమతి అస్తమానం పోరుతుంటే, రాయనివ్వకుండా అల్లరి చేసే అయిదేళ్ళ పాప గాయత్రి! ఈ రెండు పక్షాల మధ్య ఓపిగ్గా కూర్చుని రాయడం అరుదు. విద్యార్థి దశలో రాసినవి కాక ఈ మధ్య 'ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రికలో కథలూ, గేయాలు ప్రచురితాలు.

'ఆంధ్రజ్యోతి' సచిత్ర వార పత్రిక సంపాదకవర్గానికీ, 'న్యూజెర్సీ తెలుగు కళా సమితి' వారికీ కృతజ్ఞతలు. — ఆర్.వి. చలపతి

# మొదటి బహుమతి రు. 500/- గెలుచుకున్న రచన



వెయ్యి పడడంతో తిరిగి చూశాడు రామానుజం.

జగన్నాథం పెదవులు వణుకు తున్నాయి.

"బావా! ఇంట్లో అమ్మాయిని ఒక్కదాన్నీ వదలి వచ్చాము. ఒకవేళ మాకేదైనా జరిగితే... ..." జగన్నాథం పూర్తిచేయ లేకపోయాడు.

రామానుజం జాలిగా చూశాడు.

"ప్రమాదమంటూ జరిగితే మేము మాత్రం ఎలా తప్పించుకుంటాం?" అన్నాడు చిన్నగా నవ్వి.

"ఏమో. చెప్పలేం. భగవంతుని దయ ఎవరిపై ఎలా వుంటుందో! మీరు క్షేమంగా బయటపడగలిగితే అమ్మాయికి మీరే దిక్కు. నా మీద కోపం వుంచుకోకండి" జగన్నాధానికి అంత చలిలోనూ చెమటలు పోస్తున్నాయి.

"వేరకపోయి పెట్టుకున్నాం ఈ ప్రయాణం" ఏడుపు గొంతుకతో అంది

**- ఆర్. వి. చలపతి**

వరలక్ష్మి.

"ఛీ. అలా అనకు. అపచారం" అని చెంపలు వేసుకున్నాడు జగన్నాథం.

తమ వూరుకుంటే వాళ్ళ ఇంకా బెంబేలు పడతారనిపించింది రామానుజానికి.

"బావా! మీరన్నట్టు మేము మాత్రం బతికి బయట పడగలిగితే నా కోడలి బాధ్యత నాది కాదా! అయితే జరిగేది అది కాదు. అందరం క్షేమంగానే యిల్లు చేరతాం. డ్రైవర్లకు ఇదంతాసహజం" అన్నాడు.

'ఒకవేళ తమకేదైనా జరిగి జగన్నాథం తప్పించుకుంటే?'

నవ్వుకున్నాడు రామానుజం.

"అదిగో! అలిపిరి గేటు కనిపిస్తోంది" అని అరిచారెవరో.

కొంత వరకూ సర్దుకున్నారు ప్రయాణీకు లందరూ.

రామానుజం వెనక్కు తిరిగి చూశాడు.

జగన్నాథం, వరలక్ష్మి కళ్ళు మూసుకుని కూర్చున్నారు. భగవంతుని ప్రార్థిస్తున్నారు కాబోలు!

మెల్లిగా ఆగింది బస్సు అలిపిరి గేటు దగ్గర.

"ఇక్కడ అందరూ దిగండి. వెనుక వస్తున్న బస్సులో బస్టాండు దాకా వెళ్దురు గాని" అన్నాడు డ్రైవరు.

వెనకే వచ్చి ఆగింది మరో బస్సు. డ్రైవర్ వెళ్ళి ఆ బస్సు డ్రైవరుతో మాట్లాడుతున్నాడు. అందరూ హడావుడిగా బస్సు దిగుతున్నారు.

రామానుజం, కామాక్షి కూడా దిగారు. తమ వెనుక దిగుతారనుకున్న జగన్నాథం దంపతుల కోసం చూస్తున్నాడు రామానుజం.

"వాళ్ళ మనకంటే ముందు దిగి ఆ బస్సు ఎక్కేశారు" అంది కామాక్షి.

రెండో బస్సులో సీట్లు ఖాళీ లేవు. అందరూ నిలబడ్డారు బస్టాండు చేరేదాకా.

బస్సు దిగి జగన్నాథం కోసం మళ్ళీ ఎదురు చూశాడు రామానుజం.

"మాటి మాటికీ అలా వాళ్ళ కోసం చూస్తారేమిటే! వాళ్ళ అప్పుడే దిగి వెళ్ళిపోయారు. అక్కడకు వెళ్తున్నారు చూడండి. ఆపద వస్తుందనుకున్నప్పుడు సిగ్గు విడిచి మాట్లాడారే! ఇప్పుడు కనీసం చెప్పనైనా చెప్పకుండా ఎలా వెళ్ళిపోతున్నారో!" అంది కామాక్షి.

"పాపం అప్పుడు కూతురు అనాథ అవుతుందేమోనని భయపడ్డాడు. మీ అన్నయ్యా ఒక మనిషే కదా!" అన్నాడు రామానుజం.

"ఏం మనిషో! అంతా స్వార్థం!" కామాక్షి కసిగా అంది.

"నేను అన్నదీ అదే. నువ్వు మరో పేరుతో అంటున్నావు" అన్నాడు రామానుజం నవ్వుతూ. ●